మురిపిస్తున్న మినుము

- మండలంలో 1,053 హెక్టార్లలో సాగు
- అధికారుల సూచనలు పాటిస్తూ సస్యరక్షణ చర్యలు
- ఆశాజనకంగా దిగుబడులు, మార్కెట్ ధర



పాలెంచెరువు గూడెం వద్ద సాగుచేసిన మినుము పొలంలో ఏర్పాటు చేసిన లింగాకర్షక బుట్టలు

కొత్తపల్లి: ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాల కారణంగా మండలంలోని రైతులు సాగుచేసుకున్న పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గిపోవడంతో నష్టాలను చవి చూశారు. దీంతో కొంతైనా ఊరట లభిస్తుందనే ఆశతో రబీ సీజన్లో మినుము పంటను ఆశ్రయించారు. వ్యవసాయాధికారుల సూచన మేరకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే రకాలను ఎంచుకొని సాగు చేసుకున్నారు. ప్రస్తుతం దిగుబడులు ఆశాజనకంగా వచ్చే అవకాశం ఉండటం, మార్కెట్‌లో ధర కూడా బాగానే పలుకుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు

మండలంలో సుమారు 1,053 హెక్టార్లలో మినుము పంటను వేసుకున్నారు. నందికుంటలో 89, కొత్తపల్లి 80, గువ్వలకుంట్ల 16, దుద్యాల 200, ఎదురుపాడు 150, కొక్కెరంచ 30, శివపురం 84, గోకవరం 90, ముసలిమడుగు13, ఎర్రమఠం 80, గుమ్మడాపురం 206 హెక్టార్లలో పంట వేశారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు రైతులు పంట సాగులో ముందుకెళ్తున్నారు. పంటలను ఎలా సాగు చేసుకోవాలో రైతులకు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లోని అధికారులు సూచించిన మేరకు మెలకువలు పాటిస్తున్నారు. ఇందులో తెగుళ్ల నివారణ కోసం జిగురుతో కూడిన పసుపు, నీలం రంగు అట్టలను, లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకున్నారు.

అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడి....



రైతులు పంటలు సాగుచేసుకునే సమయంలో తప్పక అధికారుల సూచనల పాటించాలి. పంటలకు తెగుళ్లు, కీటకాలు ఆశించకుండా ఉండాలంటే లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు పొలంలో ఏర్పాటు చేసుకోవాలి. వీటి వాడకంతో రసాయన మందుల పిచికారీ కూడా తగ్గుతుంది. రైతులకు పంటల సాగులో ఎటువంటి సలహాలు సూచనలు కావాలన్న రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలి.

– కె.మహేష్, మండల వ్యవసాయాధికారి

నాణ్యతను బట్టి రేటు

మినుముకు మార్కెట్‌లో ప్రస్తుతం ధర ఆశాజనకంగా ఉంది. క్వింటాల్‌కు సుమారు మార్కెట్ ధర రూ.8వేలు ఉంది. రైతులు సాగుచేసుకున్న విత్తనాల రకాలను, క్వాలిటీని బట్టి రూ.7,000 నుంచి 8,000 వరకు కొనుగోళ్లు జరుగుతున్నాయి. రైతులు ఎక్కువగా మినుము పంటను సాగు చేసుకునేందుకు ఇది కూడా ఒక కారణమే. పంట కాలం 3 నెలలు కాగా సాగుకోసం ఒక ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేలదాకా ఖర్చు వస్తుంది. ప్రస్తుతం ధరలు బాగా ఉండడంతో ఆదాయం రూ.40వేలు దాకా లభించే అవకాశాలున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తెగుళ్లు పెద్దగా ఆశించలేదు



మంచి రకాలను సాగు చేసుకున్నప్పుడే దిగుబడి బాగా వస్తుంది. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తెగుళ్లను నివారించే విత్తనాలను సాగుచేసుకున్నాం. తెగుళ్ల నివారణకోసం వ్యవసాయ పద్ధతులు, సాగులో మెలకువలు పాటిస్తున్నాం. తెగుళ్లు పెద్దగా పంటను ఆశించడంలేదు. పంట పూత, పిందె దశలో ఉంది. నెలకు పూర్తిగా పంట చేతికి వస్తుంది.

– ఎం.ఉస్మాన్, రైతు, దుద్యాల గ్రామం

మార్కెట్‌లో రేటు బాగుంది



గతంతో పోలిస్తే ప్రస్తుతం మినుము పంటకు ధర బాగా ఉంది. గతంలో రూ.4,500 నుంచి 6000 లోపు ఉండేది. ప్రస్తుతం రూ.7 వేల నుంచి 8వేల వరకు నడుస్తోంది. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ధరలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. నేను 6 ఎకరాల్లో మినుము సాగుచేశాను. పంట పూర్తి అయ్యింది. దిగుబడికూడా బాగానే వచ్చింది. 50 క్వింటాళ్ల దాకా పంటవచ్చింది. నేను రూ.7,800 లకు విక్రయించాను.

– గోవిందరాజులు, రైతు ముసలిమడుగు గ్రామం

నేడు 80బన్నూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

జూపాడుబంగ్లా: సోమవారం మధ్యాహ్నం నుంచి నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అధ్వర్యంలో మండలంలోని 80 బన్నూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మంజులవాణి ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి ప్రజలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు తెలియజేయటంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్నిశాఖల మండలస్థాయి అధికారులు, ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నాలన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

నంద్యాల(అర్బన్): ద్విచక్ర వాహచోదకులు హెల్మెట్, ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని ఇన్‌చార్జ్ ఆర్టీఓ శ్రీకాంత్ కోరారు. 34వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక రామకృష్ణా డిగ్రీ కళాశాల ఆవరణలో రహదారి భద్రత- జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి క్షేమంగా గమ్యం చేరుకోవాలని సూచించారు. నిబంధనలు విరుద్ధంగా వ్యహరించే వారిపట్ల చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ముఖ్యంగా విద్యార్థులు అతి వేగంతో ద్విచక్ర వాహనాలను నడపరాదన్నారు.రామకృష్ణా రెడ్డి, ఎంవీఐ రవిశంకర్‌నాయక్, ఏఎంవీఐ నాగేంద్రరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేసీ కాల్వకు 1,640 క్యూసెక్కుల నీరు



జూపాడుబంగ్లా వద్ద కేసీలో నీటి ప్రవాహం

జూపాడుబంగ్లా: కర్నూలు-కడప కాల్వకు 1,640క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాంలో 1.2 టీఎంసీల నీటిమట్టం ఉండగా డ్యాం నుంచి కేసీ కాల్వకు 1,400 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతల పథకం ఓ మోటారు ద్వారా 240 క్యూసెక్కుల నీటిని కాల్వకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నీటిని లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు 400 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

మతసామరస్యానికి ప్రతీక



శివస్వాములతో మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు

ఆత్మకూరు: మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ మతసామరస్యానికి ప్రతీక అని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నజీర్‌అహ్మద్ అన్నారు. పట్టణంలోని శివాలయంలో ఆదివారం మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శివస్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులాలు, మతాలకు అతీతంగా అందరు కలిసి మెలసి జీవించాలని, మతసామరస్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆ కమిటీ అధ్యక్షుడు కలిముల్లా, ఉపాధ్యక్షుడు మున్నా, ప్రధాన కార్యదర్శి రఫి, ట్రెజరర్ ఖలీల్‌అహ్మద్, బలిజ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు , శివస్వాములు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పదవీ కాలం పొడిగింపు

పాములపాడు: ఆంధ్ర ప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా తన పదవీకాలన్ని పొడిగిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసిందని మండలంలోని వేంపెంట గ్రామానికి చెందిన ఒర్సు రాయసుబ్బయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో మరోసారి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. బీసీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం పట్టణ అధ్యక్షులు రణధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో ఆదివారం ఆ పార్టీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో మేధావులు, ప్రజాతంత్రవాదులు, దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. ప్రజలపై అధికభారం మోపుతూ నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యులపై అదనపు భారం మోపిందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మంజుల, స్వామన్న , సురేంద్ర, రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు పూజలు



వాసవీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలోని వాసవీమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి సేవాదళ్ అధ్యక్షుడు గ్రంథె కృష్ణమూర్తి అధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో వందలాది భక్తులు పాల్గొన్నారు. ముందుగా వాసవీ మాతను, ఆలయంలోని దేవతామూర్తులకు పంచామృతాభిషేకం, అర్చనలు చేసి పన్నీటి స్నానం చేయించి మహామంగళహారతి ఇచ్చారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్రాలతో ముస్తాబుచేశారు. అర్చకులు వేదమంత్రాలు పఠిస్తుండగా మహిళలు అమ్మవారికి పుష్పార్చన, కుంకుమార్చన వంటి విశేషపూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్య వైశ్య మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

28న ఆత్మీయ ధార్మిక సమ్మేళనం

కర్నూలు కల్చరల్: శ్రీ లలితా పీఠం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ ఉదయం 9 గంటలకు ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఆత్మీయ ధార్మిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ స్వామి తెలిపారు. పలువురు పీఠాధిపతులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొని సందేశం ఇస్తారని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి సరఫరా బంద్



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లు మూసివేసిన దృశ్యం

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి సరఫరా బంద్ చేసినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022-23 ఏడాదికి గాను పోతిరెడ్డిపాడులో ఆదివారం మధ్యాహ్నం నుంచి నీటి సరఫరాను నిలిపివేశామన్నారు. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం తగ్గేకొద్దీ పోతిరెడ్డిపాడు నుంచి నీటిసరఫరా తగ్గుతూ వచ్చిందన్నారు. శనివారం 725 క్యూసెక్కుల నీటిని సరఫరా చేయగా.. ఆదివారం మధ్యాహ్నానికి పోతిరెడ్డిపాడు గేట్లు పూర్తిగా ఎత్తినా నీరు సరఫరా కాలేదన్నారు. శ్రీశైలం జలాశయంలో 844అడుగుల నీటిమట్టం ఉన్నట్లయితే పోతిరెడ్డిపాడు నుంచి 325 క్యూసెక్కుల నీటిని విడుదల చేసుకోవచ్చు. డ్యాంలో 854 అడుగుల నీటి మట్టం చేరితే 5వేల క్యూసెక్కుల నీటిని అధికారికంగా విడుదల చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 844.20 అడుగుల నీటిమట్టం చేరినందున హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి సరఫరా నిలిచినట్లు తెలిపారు. గతేడాది జనవరి 25న నీటి సరఫరా బంద్ కాగా ఈ ఏడాది రెండు రోజులు ముందుగానే నిలిచిపోయింది. ఇప్పటిదాకా పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ జిల్లాల్లోని ప్రాజెక్టులతో పాటు నెల్లూరు, మద్రాసు ప్రాంతాలకు సుమారు 118 టీఎంసీల మేర నీటిని సరఫరా చేసినట్లు తెలిపారు. గతేడాది 116 టీఎంసీల నీటిని విడుదల చేశామన్నారు.

సిద్ధేశ్వరం బ్యారేజీతోనే సీమకు న్యాయం



మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖరరెడ్డి

జూపాడుబంగ్లా/ పాములపాడు: సిద్ధేశ్వరం బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణంతోనే రాయలసీమకు న్యాయం జరుగుతుందని రాయలసీమ కమిటీ స్టీరింగ్ కన్వీనర్ బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం నందికొట్కూరులోని ఆయన స్వగృహంలో, మండల కేంద్రంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రాంతం తీవ్ర అన్యాయానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రాంతం నుంచి ముఖ్యమంత్రులైన వారెవరూ కూడా సీమకు న్యాయం చేయలేకపోయారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీగల వంతెన కోసం రూ.1,200 కోట్లు కేటాయించిందని, అయితే బ్రిడ్జి కమ్ బ్యారేజీకి కేవలం రూ.8,00 కోట్లతో పూర్తవుతుందని అన్నారు. రాయలసీమ అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ రాజకీయలకు అతీతంగా ఈ నెల 28న తలపెట్టిన చలో సిద్ధేశ్వరం ప్రజా ప్రదర్శనకు తరరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, ఎల్లయ్య, జీఎం రవి, బుచ్చిరెడ్డి, శంకర్‌రెడ్డి, శంకర్‌గౌడు పాల్గొన్నారు.

చేతివృత్తిదారులకు నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గురుశేఖర్

జూపాడుబంగ్లా: చేతి వృత్తిదారుల అభివృద్ధికి ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి వారి అభివృద్ధికి దోహదపడాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గుణశేఖర్ కోరారు. ఆదివారం పట్టణంలోని నంది జూనియర్ కళాశాలలో చేతివృత్తిదారుల అభివృద్ధిపై రౌండుటేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 1.70కోట్ల మంది ప్రజలు పలురకాల చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయటం హర్షనీయమన్నారు. కార్పొరేషన్ల ద్వారా ఆయా కులసంఘాల్లో చేతివృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి రాయితీపై చేతివృత్తి పరికరాలు, సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేసి వారి జీవనోపాధులు మెరుగుపడటానికి చేయూతనివ్వాలని కోరారు. అలాగే కుటీర పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన యంత్రపరికరాలు, రుణాలను కార్పొరేషన్ల ద్వారా అందజేసి చేతివృత్తిదారుల జీవనోపాధి మెరుగుపడేందుకు ప్రభుత్వం సహకరించాలన్నారు. చేతివృత్తి దారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయ్, రమేష్‌బాబు, రఘురామ్మూర్తి, స్వాములు, నాగేశ్వర్, చరణ్, కోటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులతో జాగ్రత్త



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): మూత్రపిండాల జబ్బుల పట్ల అప్రమత్తత అవసరం అని యూరాలజీ నిపుణులు డాక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, కీర్తిరెడ్డి అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలాజీ కిడ్నీ కేర్ ఆసుపత్రిలో ఆదివారం మూత్రపిండాల అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మూత్రపిండాల శస్త్ర చికిత్సలపై జాగ్రత్తలను మల్టీ మీడియా ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ మూత్రపిండాల శస్త్ర చికిత్సలో వస్తున్న మార్పులను ఆధునిక విధానాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అనంతరం వైద్యులను సన్మానించారు. నంద్యాల అధ్యక్షుడు డాక్టర్ జఫ్రుల్లా, కోశాధికారి డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి భక్తి సమ్మేళనం



రామకృష్ణన్ మిషన్, మఠం స్వామీజీలు, ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: రామకృష్ణ – వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కర్నూలు వీఆర్ కాలనీలో నిర్వహిస్తున్న మూడు రోజుల రాష్ట్ర స్థాయి భక్తి సమ్మేళనం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ తిరుపతి కార్యదర్శి, రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ (ఆర్‌వీబీపీపీ)రాయలసీమ అధ్యక్షులు స్వామి సుకృతానంద మహరాజ్ మాట్లాడుతూ సేవా గుణం, మావనతా విలువలు కలిగి ఉండాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. స్వామి సన్నివాసానంద , స్వామి వేద విద్యానంద మహరాజ్ , స్వామి దివ్య బోధానంద మహరాజ్, స్వామి విభాకరానంద మహరాజ్ , స్వామి దివ్య ధర్మానంద మహరాజ్ సందేశమిచ్చారు. స్వామీజీలకు యతి పూజ నిర్వహించారు. వలంటీర్లకు, వివిధ సమితుల నిర్వాహకులకు స్వామీజీలు జ్ఞాపికలు బహూకరించారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కన్వీనర్ డాక్టర్ నాగ త్రిశూల పాణి, నిర్వాహణ కార్యదర్శి డాక్టర్ కె.జి. శరత్ చంద్రబాబు రామకృష్ణ సేవా సమితి నగర అధ్యక్షులు కేజీ గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

నంద్యాల(సిటీ): కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరిస్తే అడ్డుకుంటామని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 23,24 తేదీల్లో జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల వద్ద దీక్షలు, 25న కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష, 27న విశాఖ పట్టణంలో మహాగర్జన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా మహా గర్జనకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఏఐటీయూసీ నాయకులతో కలిసి స్థానిక కార్యాలయంలో విడుదల చేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలనుకోవడం దుర్మార్గమన్నారు. నాయకులు సుబ్బరాయుడు, కలాం, అన్వర్, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తప్పెట కళాకారులను ఆదుకోవాలి

నంద్యాల(అర్బన్): అంతరించి పోతున్న డప్పు కళ పునరుజ్జీవం పొందాలంటే తప్పెట కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి రవిరాజ్ కోరారు. పట్టణంలోని డప్పు కళాకారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. గాలి రవిరాజ్ మాట్లాడుతూ 45 ఏళ్లు నిండిన డప్పు కళాకారుల కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కళాకారులందరికీ ఉచితంగా డప్పులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కళాకారులు మద్దయ్య, సుబ్బరాయుడు, ఏసన్న, నాగన్న పాల్గొన్నారు.

డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గడివేముల: అటో,ట్రాలీ డ్రైవర్లకు ప్రత్యేకంగా సంక్షేమం బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల వెంకట్ కోరారు.ఆదివారం మండల కేంద్రం గడివేములలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో సీఐటీయూ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ నాయకులు మాట్లాడుతూ నిత్యవసర ధరలను అదుపు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, షేక్ బాబు, శివుడు, అస్లాంబాష, నారాయణ, ప్రభాకర్, పెద్దన్న సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కర్నూలు కల్చరల్: స్థానిక సంకల్ బాగ్‌లోని హరిహర క్షేత్రంలోని శ్రీదేవి భూదేవి సహిత శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయం 17 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో మొదటి రోజు మహా సంకల్పం, అంకురార్పణ, ధ్వజారోహణ, గోపూజ, పంచామృతాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం చేశారు. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ దంపతులు పూజల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్.కె. రాజశేఖర్ రావు, కమిటీ సభ్యులు మురళి కల్కూర, ఉమేష్, సేవా దళ్ సభ్యులు పాల్గొన్నారు.

నంద్యాల మార్కెట్ యార్డు నూతన కమిటీ నియామకం

నంద్యాల అర్బన్: నంద్యాల మార్కెట్ యార్డు నూతన కమిటీని ప్రభుత్వం నియమించింది. యార్డు అసిస్టెంట్ సెక్రటరీ శేషిరెడ్డి ఆధ్వర్యంలో యార్డు చైర్మన్‌గా పోలూరు మహేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్‌గా నాగన్న ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈనెల 30న చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, మెంబర్‌లుగా మునయ్య, వెంకటేశ్వరరెడ్డి, షేక్ సత్తార్, దిలీప్‌కుమార్, కత్తిశంకర్, లక్ష్మీప్రసన్న, రామేశ్వరమ్మ, లింగమ్మ, షేక్ కౌసర్, హైమావతి, కృష్ణమూర్తి, చక్రవర్తి, మమతను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ చౌదరి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆదివారం మంచి రోజు కావటంతో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించానని తెలిపారు. ఈనెల 30న కార్యవర్గంతో కలిసి ప్రమాణస్వీకారం చేస్తామని, కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొంటారని వివరించారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే శిల్పా రవికి ధన్యవాదాలు తెలిపారు.

నందికొట్కూరు చిత్రకారుడికి సత్కారం



దేశెట్టి శ్రీనివాసులును సత్కరిస్తున్న నిర్వాహకులు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణానికి చెందిన చిత్రకారుడు దేశెట్టి శ్రీనివాసులు వేసిన చిత్రకళారూపాలను మెచ్చి వినుగొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రకళా ప్రదర్శనలో అతన్ని నిర్వాహకులు సత్కరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను గీసిన మహిళల చిత్రాలు, అర్థనారీశ్వరుని చిత్రం , మైత్రిబంధం, నాడు-నేడు, మహాకవి గౌతమ బుద్ధుని చిత్రం, స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రాలు రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ప్రదర్శించినట్లు తెలిపారు. ఇవి నిర్వాహకులకు, చూపరులను ఆకట్టుకోవడంతో శాలువను కప్పి, జ్ఞాపిక పూలమాలతో సత్కరించారన్నారు.

'పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తా'



తనకు ఓటు వేయాలని పట్టభద్రులను కోరుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

జూపాడుబంగ్లా: పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనను ఎన్నుకుంటే పట్టభద్రుల సమస్యలను పరిష్కరిస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని విజయవాణి స్కూల్‌లో పట్టభద్రులు, టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు తనపై నమ్మకం ఉంచి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. విద్యావంతులు, మేధావులు ప్రతిపక్షాల ప్రలోభాలకు లోనుకాకుండా శాసన మండలికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక ఓట్లు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని విజయవాణి స్కూల్ కరస్పాండెంటు శంకర్‌రెడ్డి కోరారు.

అధికలోడుతో అనర్థాలు



ఎలాంటి రక్షణ లేకుండా అధికలోడుతో ఇసుకను తరలిస్తున్న టిప్పర్లు

జూపాడుబంగ్లా: సామర్థ్యం కంటే అధికలోడుతో కర్నూలు నుంచి ఆత్మకూరు వైపు నిత్యం ఇసుక, కంకరను టిప్పర్లు తరలిస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు అధిక లోడుతో ఇసుక, కంకరను తరలిస్తున్నాయి. దీంతో రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారుతోంది. టిప్పర్ డ్రైవర్లు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా ఇసుక లోడును తరలిస్తుండటంతో వెనుక వస్తున్న ద్విచక్రవాహనాల దారుల కళ్లల్లో పడుతుండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. అంతే కాకుండా స్పీడ్ బ్రేకర్ల వద్ద కుదుపులకు టిప్పర్లలోని ఇసుక, కంకర కిందపడి ప్రయాణానికి ఇబ్బందులకు కలిగిస్తున్నాయి. ద్విచక్రవాహనాల దారులు వాటిపై వెళ్లినప్పుడు జారి కిందపడున్నారు. పోలీసులు, రోడ్డు, రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకొని అధికలోడుతో వెళ్తున్న వాహనాల రాకపోకలను నియంత్రించాలని ప్రయాణికులు, వాహనాల డ్రైవర్లు కోరుతున్నారు.

నమ్మకమైన వైద్యం ఆయుర్వేదం



మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): అనాదిగా ఆయుర్వేద వైద్యం నమ్మకమైందిగా పేరుగాంచిందని, ఈ విధానంలో ఎలాంటి ప్రతికూలతలు ఉండవని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పేర్కొన్నారు. శిరిగిరి వెంకప్ప ఆయుర్వేద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్యామ్ విద్యావిహార్ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో వారు మాట్లాడారు. దీర్ఘకాలిక జబ్బులకు ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయన్నారు. ప్రకృతి ఆధారంగా తయారు చేసే ఈ మందులను ఎవరైనా ఉపయోగించవచ్చని చెప్పారు. అనంతరం వైద్యులు రోగులకు ఉచితంగా మందులు అందజేసి పలు సూచనలు చేశారు.నిర్వాహకులు శిరిగిరి రమేష్, డాక్టర్ రాకేష్‌రెడ్డి, డాక్టర్ సహదేవుడు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్ష



శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

పాణ్యం: కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపికకు నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. కట్టుదిటమైన భద్రత మధ్య ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ పరీక్ష నిర్వహించారు. పాణ్యం మండల పరిధిలోని పరీక్ష కేంద్రాలను నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి, ఏఎస్పీ రమణ, డీఎస్పీలు తనిఖీ చేశారు. చేపట్టారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో మొత్తం 33 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్, తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామన్నారు. 17, 331మంది పరీక్ష రాయాల్సి ఉండగా అందులో 1092 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. కాగా పాణ్యం మండలం నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ, ఆర్‌జీఎం, విజయానికేతన్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు నిర్వహించారు. సీఐ వెంకటేశ్వరరావు, సుబ్బరాయుడు, ప్రీతమ్‌రెడ్డి ఎస్ఐలు ఆయా కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

అలరించిన మ్యూజికల్ నైట్

కర్నూలు కల్చరల్: ఆర్ఆర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ఏ షామ్ మస్తాని మ్యూజికల్ నైట్ కార్యక్రమం అలరించింది. ఈవెంట్ నిర్వాహకులు, సింగర్ రాణి, గాయనీ గాయకులు అర్షద్, లత, అమీర్, చాంద్ బాషా, జయపాల్, సుధాకర్, దస్తగిర్‌బాషా ఆలపించిన సుప్రసిద్ధ పాటలు ఆహుతులను మైమరిపించాయి.